గడప దాటని ఓటరు

- ముషీరాబాద్‌లో అత్యల్పంగా 40.24 శాతం పోలింగ్ నమోదు
- గత అసెంబ్లీ ఎన్నికల కంటే 10 శాతం తక్కువ
- అంబర్‌పేట సాయంత్రం వరకు 40.6 శాతం నమోదు


టీఆర్టీ కాలనీ స్ఫూర్తి భవన్ సెంటర్ వద్ద క్యూలో నిలుచున్న ఓటర్లు

ముషీరాబాద్, అంబర్‌పేట్: ముషీరాబాద్, అంబర్‌పేట్ నియోజకవర్గాల్లో ఓటరు గడప దాటలేదు. బద్ధకం వీడలేదు. ఓటు విలువ, ప్రాధాన్యాన్ని అర్థం చేసుకోలేకపోయారు. ఫలితంగా పాతబస్తీ నియోజకవర్గాలతో ఈ రెండు నియోజకవర్గాలు కూడా పోలింగ్‌లో పోటీ పడ్డాయి. 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 52 శాతం పోలింగ్ నమోదు కాగా ఈ దఫా సుమారు 12 శాతం పోలింగ్ తగ్గి 40.24 శాతం నమోదైంది. చివరి లెక్కలు వచ్చే సరికి మరికొద్దిగా పెరిగే అవకాశం ఉంది. పాతబస్తీ నియోజకవర్గాలైన యాకత్‌పూర (27.87), నాంపల్లి (32.04), చార్మినార్ (34.02), మలక్‌పేట్ (36.09), బహదూర్‌పురా (39.11)లతో ముషీరాబాద్ కూడా పోటీపడడం గమనార్హం. ఉదయం నుంచే మందకొడిగా ప్రారంభమైన పోలింగ్ అదే ఒరవడిని కొనసాగిస్తూ వచ్చింది. ప్రతి రెండు గంటలకు కేవలం అటూ ఇటూగా పది శాతం పోలింగ్ పెరుగుతూ పోయింది. ఉదయం 9 గంటలకు 3.94, 11 గంటలకు 10.54, ఒంటి గంటకు 17.38, మధ్యాహ్నం 3 గంటలకు 27.98, పోలింగ్ ముగిసే సాయంత్రం 5 గంటలకు 40.24 శాతం పోలింగ్ నమోదు కావడం పలువురిని ఆశ్చర్యానికి గురి చేసింది. ఆయా నియోజకవర్గాల్లోని విద్యావంతులు, అపార్ట్‌మెంట్ వాసులు, కాలనీ వాసులు కూడా పోలింగ్ స్టేషన్ల వరకు కనెత్తి కూడా చూడకపోవడం అందరిని విస్మయానికి గురి చేసింది.

పోలింగ్ ప్రశాంతం..

అంబర్‌పేట్: అంబర్‌పేట నియోజకవర్గంలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. గురువారం ఉదయం 7 గంటలకే పోలింగ్ ప్రారంభమైంది. నియోజకవర్గ పరిధిలోని 239 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ ప్రక్రియ కొనసాగింది. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు పలుచగా ఉన్నప్పటికి మరికొన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు బారులు తీరారు. ఎన్నికల యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. దిగువ మధ్య తరగతి ప్రాంతాల్లో పోలింగ్ ఎక్కువగా జరిగింది.

సమయం మించిపోవడంతో నిరాశ చెందిన ఓటర్లు...

కొన్ని పోలింగ్ కేంద్రాల్లో చివరి నిమిషంలో ఓటర్లు పోలింగ్ కేంద్రానికి వచ్చి నిరాశ చెందారు. సాయంత్రం అలస్యంగా వచ్చిన వారిని ఎన్నికల అధికారులు, పోలీస్ అధికారులు అనుమతించలేదు. ఉదయం ఆరగంట అలస్యంగా ప్రారంభించినప్పటికి చివరిలో సమయం ఇవ్వలేదని ఓటర్లు అసంతృప్తి వ్యక్తం చేశారు.

అభ్యర్థుల్లో టెన్షన్....

ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు ఉదయం నుంచి పోలింగ్ సరళిని ప్రత్యేకంగా పర్యవేక్షించారు. బూత్‌ల వారిగా పోలింగ్ సరళిని ఎప్పటికప్పుడు ఏజెంట్‌లను అడిగి తెలుసుకున్నారు. తమకు అనుకూలంగా ఉన్న చోట్ల ఆశించిన ఓట్లు పడ్డాయా లేదా అని పార్టీ శ్రేణులను అడుగుతూ ఎన్నికల సరళిపై దృష్టి సారించారు. ఎక్కడ తగ్గుతున్నాయో అక్కడ దిద్దుబాటు చర్యలు చేపట్టారు.

గ్రామాల్లో ఓటుకే ప్రాధాన్యం ఇచ్చారు

హైదరాబాద్‌లో నివసిస్తున్న చాలా మందికి స్వగ్రామంలో కూడా ఓట్లు ఉన్నాయి. నగరంలో కంటే తమ స్వగ్రామంలో ఓటు వేయడానికి నగర వాసులు మొదటి ప్రాధాన్యం ఇచ్చి ఆయా ప్రాంతాలకు వెళ్లారు. దీనికి తోడు యువ ఓటర్ల అనాసక్తత కూడా మరో కారణం. శని, ఆదివారాలు సెలవు కావడంతో శుక్రవారం ఒక రోజుకు సెలవు పెట్టి ఎన్నికల్లో పాల్గొనకుండా నాలుగు రోజుల పాటు కలిసి వస్తుందని చాలా మంది సుదూర ప్రాంతాలకు తరలివెళ్లారు. సాఫ్ట్‌వేర్ నార్త్ ఇండియన్లు ఎన్నికలకు దూరంగా ఉండగా విద్యావంతులు అంతగా ఆసక్తి కనబరచలేదు. దీంతో పోలింగ్ శాతం గణనీయంగా తగ్గిపోయింది.


ఎం.నర్సయ్య, టీజేఎస్ గ్రేటర్ అధ్యక్షులు.

ప్రభుత్వ పథకాల్లో కోత విధించాలి

ఓటింగ్‌లో పాల్గొనడం తప్పనిసరి చేయాలి. పాల్గొనని వారికి ప్రభుత్వం అందించే సబ్సిడీలు, సంక్షేమ పథకాలను అందించకూడదు. అలాగే పోలింగ్‌లో పాల్గొనడం తప్పనిసరి చేయాలి.


శ్రీను నాయుడు, సోషల్ యాక్టివిస్ట్


మదర్స్ స్కూల్ సెంటర్ వద్ద ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు

ఇళ్లకు వెళ్లి..పిలుచుకు వచ్చి..


పాత నల్లకుంట ఆర్యభట్ట స్కూల్ వద్ద..

మధ్యాహ్నం తర్వాత ఊపందుకున్న పోలింగ్

నల్లకుంట: నల్లకుంటలో గురువారం పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఓటర్లు అంతంత మాత్రంగానే పోలింగ్ స్టేషన్లకు చేరుకోవడంతో ఉదయం పోలింగ్ మందకోడిగా సాగింది. దీంతో పోలింగ్ స్టేషన్లన్నీ ఖాళీగా కనిపించాయి. దీంతో మధ్యాహ్నం వరకు వేచి చూసిన ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు ఓటర్ల ఇళ్ల వద్దకు వెళ్లి వారిని పోలింగ్ సెంటర్లకు తీసుకురావడం కనిపించింది. దీంతో మధ్యాహ్నం 1.30 గంటల తర్వాత ఊపందుకుంది. దీంతో నాయకులు ఊపిరి పీల్చుకున్నారు. ఓటర్లు ఆలస్యంగా పోలింగ్ సెంటర్ల వద్దకు చేరుకోవడంతో సాయంత్రం పోలింగ్ సమయం ముగిసినప్పటికి, అప్పటికే పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలో వేచి ఉన్న ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేందుకు అనుమతి ఇచ్చారు. అయితే పోలింగ్ మాత్రం ఆశించిన స్థాయిలో జరగలేదు.


గోల్నాకలో సమయం మించిపోవడంతో అవకాశం ఇవ్వాలని అధికారులను వేడుకుంటున్న ఓటర్లు


బద్రీనారాయణాచార్యులు(97)


కృష్ణమాచార్యులు (89)

ఆదర్శనీయులు

- ఓటు వేసిన వయోవృద్ధులు

చిక్కడపల్లి: ఒక పక్క హైదరాబాద్ నగరవాసులు అందులోనూ ప్రత్యేకంగా యువత ఓటు వేయడానికి అంతగా ఆసక్తి చూపకపోయినా 90 ఏళ్లకు పై బడిన వారు మాత్రం శరీరం సహకరించపోయినా కూడా సుదూర ప్రాంతాల నుంచి పోలింగ్ కేంద్రాలకు వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అశోక్‌నగర్ నగర కేంద్ర గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రానికి ఎస్‌జీఆర్‌ఐలో ఉన్నతాధికారిగా పనిచేసి పదవీ విరమణ పొందిన బద్రీనారాయణాచార్యులు (97) కుటుంబ సభ్యుల సహకారంతో వీల్ చైర్‌లో వచ్చి ఓటు వేసి వెళ్లారు. అదే విధంగా కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో డీబీఆర్‌మిల్స్‌లో పనిచేసి పదవీ విరమణ పొందిన కృష్ణమాచారి(89) తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వృద్ధులు సైతం ఓటింగ్‌లో పాల్గొనగా నగర ప్రజలు పోలింగ్‌లో పాల్గొనకుండా ఇంటికే పరిమితం కావడం చర్చనీయాంశంగా మారింది.


ఓటు వేసేందుకు వస్తున్న దివ్యాంగుడు

న్యూ రామాలయంలో బీఆర్ఎస్ అభ్యర్థి కాలేరు పూజలు

నల్లకుంట: ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో బీఆర్ఎ అభ్యర్థి కాలేరు వెంకటేష్ గురువారం ఉదయం న్యూ నల్లకుంటలోని శ్రీ సీతారామాంజనేయ స్వామి సరస్వతి దేవాలయాన్ని సందర్శించి, సీతారాములకు ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆయనకు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.


కాలేరు వెంకటేష్‌ను ఆశీర్వదిస్తున్న అర్చకులు

పేరు అతనిది.. ఫొటో ఆమెది

హిమాయత్‌నగర్: హిమాయత్‌నగర్‌లోని కేశవ్ మెమోరియల్ కాలేజీలో పోలింగ్ బూత్ నం.18 లో ఓ వ్యక్తి ఓటు వేయకుండాలనే వెనుతిరిగాడు. గాంధీకుటీర్ ప్రాంతానికి చెందిన కుమార్ జురిగల అనే వ్యక్తి ఓటు వేయడానికి పోలింగ్ కేంద్రానికి వెళ్లాడు. తన ఓటరు కార్డు చూపించి ఓటరు జాబితాలోని స్లిప్ తీసుకునే క్రమంలో తన ఫొటో ఉండాల్సిన స్థానంలో మహిళ ఫొటో ఉండడంతో కంగుతిన్నాడు. దీంతో తాను ఓటు వేయకుండానే వెళ్లిపోయాడు.



ఓటేసిన అభ్యర్థులు..


బీఆర్ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్


జెమిని కాలనీలో..బీజేపీ అభ్యర్థి పూస రాజు


ఆర్‌జీ కేడియా కాలేజీలో.. బీజేపీ అంబర్‌పేట అభ్యర్థి సి.కృష్ణయాదవ్


గోల్నాకలో.. బీఆర్ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేష్


కవాడిగూడలో..స్వతంత్ర అభ్యర్థి లక్ష్మీనారాయణ


పోలింగ్ సరళని పరిశీలిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి అంజన్‌కుమార్‌యాదవ్


కవాడిగూడ తాళ్ల బస్తీలో.. సీపీఎం అభ్యర్థి ఎం.దశరథ్


కాంగ్రెస్ అభ్యర్థి సి.రోహిణ్ రెడ్డి

నర్సింగ్ రావు మృతి తీరని లోటు

కవాడిగూడ: ముషీరాబాద్ విలేకరి, జర్నలిస్టు సంఘం నేత ఎర్రం నర్సింగ్‌రావు మృతి పత్రికా రంగానికి తీరని లోటని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య అన్నారు. గురువారం లోయర్ ట్యాంక్ బండ్‌లోని అంబేడ్కర్ భవన్‌లో జరిగిన ఎర్రం నర్సింగ్ రావు దశదిన కార్యక్రమానికి హాజరైన మామిడి సోమయ్య ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సర్సింగ్‌రావు జర్నలిస్టుగానే కాకుండా సామాజిక సేవకుడిగా అనేక సమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు. హైదరాబాద్ జర్నలిస్టు యూనియన్, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ తదితర సంఘాల్లో కీలక పాత్ర పోషించారన్నారు. ఆయన మరణం అత్యంత బాధకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, పత్రికా యాజమాన్యం ఆయన కుటుంబాన్ని ఆదుకోవాలని మామిడి సోమయ్య కోరారు. కార్యక్రమంలో నాయకులు బి. బసవపున్నయ్య, ఆనందం, చంద్రశేఖర్, రామారావు, బొల్లం శ్రీనివాస్, ఎం. నర్సయ్య, వీరా రెడ్డి, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.


నర్సింగ్‌రావు చిత్రపటానికి నివాళులర్పించిన మామిడి సోమయ్య తదితరులు


కుటుంబ సభ్యులతో రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్


వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓటు వేసిన రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య


దీడీ కాలనీలో ఓటు హక్కు వినియోగించుకున్న బీజేపీ జాతీయ నాయకులు మురళీధర్‌రావు

ఓటెత్తిన వీఐపీలు

ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గంలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదు. పోలీసులు పోలింగ్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాలకు వంద మీటర్ల దూరంలో ఆయా పార్టీల మద్దతుదారులు కౌంటర్లను ఏర్పాటు చేసుకోని పోలింగ్‌కు వచ్చే ఓటర్లకు సహాయ సహకారాలను అందించారు. హర్యానా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ, భార్య, కూతురుతో రాంనగర్‌లోని 232 పోలింగ్ బూత్‌లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ జవహర్‌నగర్, మరో రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య అడిక్‌మెట్‌లోని వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇక అభ్యర్థులైన ముఠా గోపాల్ గాంధీనగర్‌లో, పూస రాజు జెమిని కాలనీలో ఓటు హక్కును వినియోగించుకోగా, పాతబస్తీకి చెందిన అంజన్‌కుమార్‌యాదవ్ అక్కడే గొల్లకిడికిలోని తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.


దామోదర్ గుప్తా దంపతులు


పద్మాకాలనీలోని గురుదత్త స్కూల్‌లో.. ఎస్.ఎల్.పద్మ


దోమలగూడ ఏవీ కళాశాలలో అభిషేక్‌రెడ్డి తదితరులు


ఓటు వేసిన బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు కె.గీతామూర్తి


గాంధీనగర్‌లో..ఎంఎన్ శ్రీనివాస్‌రావు కుటుంబ సభ్యులు.


గాంధీనగర్‌లో నాయిని కుమార్తె సమతారెడ్డి, అల్లుడు వి.శ్రీనివాస్‌రెడ్డి..

సాయంత్రం కదిలిన బస్తీలు

అంబర్‌పేట్: వారందరూ బస్తీ వాసుల ఓటర్లు. తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రంలో పోలింగ్ శాతం నమోదు కావడంలేదు. మధ్యాహ్నం 3 గంటలు దాటినా వారు ఎందుకు ఓటింగ్‌కు రావడం లేదనే విషయం చర్చనీయంశంగా మారింది. 3 గంటల తర్వాత ఒకేసారి గుంపుగా వందల మంది తమ పోలింగ్ కేంద్రానికి చేరుకున్నారు. ఇంతమంది ఉదయం నుంచి ఓటు వేయకుండా ఎందుకు అగారు... ఆకస్మాత్తుగా ఎందుకు కదిలారు అని అంశం కలకలం రేపింది. పోలీసులు, ఎన్నికల అధికారులు ఈ సంఘటనతో ఉలిక్కిపడ్డారు. ఈ సంఘటన బాగ్ అంబర్‌పేట డివిజన్‌లో బతుకమ్మ కుంటలో ఓ బస్తీలో చోటు చేసుకుంది. పార్టీల అభ్యర్థులు సహితం వీరి వైఖరితో అవాక్కయ్యారు.


బతుకమ్మకుంటలో ఒకేసారి ఓటింగ్‌కు వచ్చిన బస్తీ వాసులు